## క్లుప్తంగా

### అంకిత భావంతో విధులు నిర్వర్తించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ జనార్దనరావు

**కొలిమిగుండ్ల:** సచివాలయ సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, గ్రామ,వార్డు సచివాలయాల జిల్లా అధికారి జనార్దనరావు సూచించారు. మండల కేంద్రం కొలిమిగుండ్ల ఒకటి, రెండుతోపాటు బెలుం సచివాలయాలను శుక్రవారం ఎంపీడీఓ సుబ్బరాజుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. రికార్డులతో పాటు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ–సర్వీసుల కింద సేకరించిన మొత్తాన్ని సంబంధిత హెడ్‌కు అందజేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలించి చిన్నారుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు.

### వడ్డెర కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి



సీసీ రోడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం

**కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని వడ్డెర కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కాలనీలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి చొరవ తీసుకొని రోడ్డు సమస్యను అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కంపెనీ సామాజిక బాధ్యత కింద రూ.15 లక్షల వ్యయంతో 70 మీటర్ల మేర సీసీ రోడ్డు వేయించారు. అల్ట్రాటెక్ కంపెనీతో పాటు కేపీ రామ్మోహన్‌రెడ్డికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

### సన్మానం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**డోన్:** అణగారిన వర్గాల ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి ప్రజ లు తోడ్పాటునందించాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నంద్యాల జిల్లా నూతన అధ్యక్షుడు పోస్టుపసాద్ కోరారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో పోస్టుపసాద్‌ను శుక్రవారం రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీరాములు, ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పిటిసి బద్దల రాజ్‌కుమార్ యాదవ్, మునిసిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, పార్టీ పట్టణ అధ్యక్షులు కొట్రికె హరికిషన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.

### క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ నయం



వైద్య సిబ్బందికి సూచనలు అందజేస్తున్న టీబీ యూనిట్ జిల్లా అధికారి

**కోవెలకుంట్ల:** క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని టీబీ యూనిట్ జిల్లా అధికారి మల్లికార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని టీబీ రోగుల సంఖ్య, వారికి అందుతున్న మందుల వివరాలను డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభానిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాన్పుల గది, నాడు– నేడు పథకం కింద జరుగుతున్న ఆసుపత్రి అభివృద్ధి పనులను పరిశీలించారు. మాతా, శిశు మరణాల శాతాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, గిరిజ, ప్రభావతి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

**డోన్ రూరల్:** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిరాహార దీక్ష చేపట్టారు. కనీసం వెతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు లక్ష్మీనారాయణ, అబ్బాస్, అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ ప్రభుత్వాన్ని కోరారు.

# మారని తీరు!

- రోడ్డు నిబంధనలు పాటించని వాహనచోదకులు
- ప్రాణాలు కోల్పోతున్న యువత
- సదస్సులు నిర్వహిస్తున్నా కొరవడిన చైతన్యం



యూటర్న్ లేనిచోట అక్రమంగా భారీకేడ్లను తొలగించి ఎన్‌హెచ్ 44 దాడుతున్న యువకుడు (ఫైల్)

**డోన్:** అడ్డదారుల్లో వెళ్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు కొందరు వాహన చోదకులు. రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారుల్లో వెళ్తూ ప్రాణాల ముప్పునకు గురువుతూనే ఉన్నారు. కొందరు డ్రైవింగ్ నిర్లక్ష్యం, మద్యం మత్తు, నిద్రమత్తులో ప్రమాదాలకు గురువుతుటే... మరికొందరు రాంగ్‌రూట్‌లో వాహనాలను నడుపుతూ అనవసరంగా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ ప్రమాదాలు జాతీయ రహదారిపై అధికంగా జరుగుతున్నాయి. ప్రత్యేకించి జాతీయ రహదారిపై దొరపల్లె, రూరల్ పోలీస్ స్టేషన్ సమీపాన రాంగ్‌రూట్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. యూటర్న్ లేకపోవడం.. చుట్టూ తిరిగిరావాల్సిన పరిస్థితుల్లో అడ్డదారుల్లో ప్రయాణిస్తున్నారు వాహన చోదకులు. ప్రత్యేకించి యువకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఒక్క జనవరి మాసంలోనే పట్టణ శివారులోని దొరపల్లె వద్ద రాంగ్‌రూట్‌లో హైవేను దాటేందుకు వెళ్లి ముగ్గురు యువకులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. మోడల్ స్కూల్ వద్ద వెనుక వస్తున్న వాహనం ఓవర్‌టేక్ చేయబోవడంతో ముందు వెళ్తున్న మోడల్ స్కూల్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అయినా వాహనచోదుకుల తీరు ఏ మాత్రం మారడం లేదు. పట్టణ శివారులోని రూరల్ పోలీసు స్టేషన్ వద్ద నుండి అత్యధికులు కూరగాయల మెయిన్ మార్కెట్, మోడల్, కస్తూర్బా, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, కోట్ల స్టేడియం, ఫుడ్ కార్పొరేషన్ గోడౌన్స్ వైపునకు వెళ్లేందుకు అడ్డదారిలో ప్రయత్నిస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక్కడ పోలీసులే కళ్లెదుటే ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘనలు లేకపోలేదు. అదేవిధంగా జాతీయ రహదారిపై పలు గ్రామాలకు రోడ్డు దాటేందుకు యూటర్న్‌లు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామీణులు ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

**జరిమానాల విధిస్తున్నా....**

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహన చోదకులకు సంబంధిత అధికారులు జరిమానాలు విధిస్తున్నా మార్పు రావడంలేదు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల కట్టడికి పోలీస్ యంత్రాంగం సదస్సులు, అవాహన ర్యాలీలు నిర్వహిస్తున్నా ఆశించిన ఫలితం రావడం లేదన్నది వాస్తవం. డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.5వేలు, ఇన్సూరెన్స్ లేకుంటే రూ.2వేలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుంటే రూ.2వేల నుండి రూ.5వేలు, హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకున్నా అధనంగా మరో వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామంటూ సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నా మార్పు కనిపించడం లేదు.

#### అధికారుల నిర్లక్ష్యం కూడా ఉంది



పట్టణ శివార్లలో రెండు కి.మీ పోడవున విస్తరించి ఉన్న ఎన్‌హెచ్ 44 దాటి పలు గ్రామాలకు వెళ్లాల్సి ఉంది. అయితే అధికారులు ఎక్కడ కూడా యూ టర్న్లు ఏర్పాటు చేయలేదు. ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యం కూడా లేకపోలేదు. దీంతో ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటివెళ్లేందుకు ప్రయత్నిస్తూ పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

– భానుసింగ్, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి, డోన్.

#### ప్రతిఒక్కరూ ఆలోచించాలి



ప్రమాదాల నివారణ ఒక్క పోలీసులతో సాధ్యమయ్యే విషయం కాదు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచించాల్సి ఉంది. మైనర్లకు కూడా ద్విచక్రవాహనాలు ఇస్తున్న తీరు ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. మైనర్లకు వాహనం ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నా మారడం లేదు. ఇప్పటికైనా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

– శేషయ్య, అర్బన్ సీఐ, డోన్

#### సీసీ కెమెరాలు ఏర్పాటు



రోడ్డు నిబంధనలను తరచుగా అతిక్రమించే చోట సీసీ కెమెరాలను అమర్చాల్సిన అవసరం ఉంది. దీని ద్వారా నిబంధనలు పాటించని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, జరిమానాలు విధించడం జరుగుతుంది. ప్రమాదాల కట్టడికి రోడ్డు నిబంధనలు మరింత కఠినంగా అమలు చేస్తాం. ప్రజలు కూడా సహకారం అందించాల్సిన అవసరం ఉంది.

– క్రాంతికుమార్, ఎంవీఐ, డోన్

### బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

**కొలిమిగుండ్ల:** బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎస్‌బీసీసీ జిల్లా కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని కస్తూర్బా పాఠశాలలో బాల్యవివాహాలపై విద్యార్థినులకు ఆయన అవగాహన కల్పించారు. బాల్య వివాహాల మూలంగా బాలికలు ఎన్నో అనర్థాలు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. మాతాశిశు మరణాలు ఎక్కువగా ఉంటాయని, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం, మానసిక, శారీరక వికలాంగత్వ సంతానం పుడుతారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాల కట్టడికి కల్యాణ మస్తు, షాధితోఫా పథకాలను అమలు చేస్తుందన్నారు.

### నేడు డోన్ రహదారిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**బేతంచెర్ల:** పట్టణంలోని ప్రధాన సబ్ స్టేషన్‌ల్లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 10 నుంచి 1 గంట వరకు డోన్ రహదారిలో హెచ్ కొట్టాల వరకు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ మహబూబ్ వలీ శుక్రవారం తెలిపారు. పరిశ్రమల యజమానులు గమనించి సహకరించాలని కోరారు.

## వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన ర్యాలీ



వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

**బేతంచెర్ల:** రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై డోన్ టీడీపీ ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు బేతంచెర్ల పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. డోన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి బుగ్గన పోలీసులను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారంటూ ధర్మవరం సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వైఎస్సార్‌పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ మేర కు స్థానిక టీడీపీ కార్యాలయంలో ధర్మవరం సుబ్బారెడ్డి ఉన్నారని తెలుసుకున్న నిరసనకారులు అక్కడికి పరుగులు తీశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి టీడీపీ కార్యాలయం వద్దకు బయలు దేరడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు టీడీపీ కార్యాలయం ఉన్న ధర్మవరం సుబ్బారెడ్డితో పాటు నాయకులను పంపించేశారు. టీడీపీ కార్యాలయం చేరుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులను బేతంచెర్ల, బనగానపల్లె సీఐలు సీఐ ప్రియతం రెడ్డి, సుబ్బరాయుడు పోలీసు సిబ్బంది తోకలిసి ర్యాలీని అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు పోలీసులు నచ్చచెప్పడంతో ఉద్రిక్తతకు తెరపడింది. రెండు పార్టీ కార్యాలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బందితో బందో బస్తు ఏర్పాటు చేశారు.

**శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు**

**బేతంచెర్ల:** పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని, ఇరువర్గాల వారు సంయమనం పాటించాలని సీఐ ప్రియతం రెడ్డి శుక్రవారం తెలిపారు. బేతంచెర్ల పట్టణంలో శాంతియుత వాతావరణానికి ఇరు పార్టీల నాయకులు సహకరించాలని, గొడవలు ప్రేరేపించే, కార్యకర్తలు రెచ్చ గొట్టే ప్రకటనలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు మెసేజ్‌లు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ ప్రియతం రెడ్డి హెచ్చరించారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలి



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

**బనగానపల్లె రూరల్:** వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం వాసవీ పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాల, ఇల్లూరుకొత్తపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పట్టభద్రులను నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసులు,సుధాకర్,రమణలు ప్రచారం నిర్వహించారు.

**బేతంచెర్ల:** వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలిపించాలని ఆయన సోదరుడు వెన్నపూస నరేష్ రెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. కస్తూర్బా, సంజీవనగర్ ప్రభుత్వ పాఠశాల, పద్మావతి ఐటీఐ, చైతన్య స్కూల్‌కు వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డక్కి శేఖర్, మురళీధర్ రెడ్డి,రామనాయుడు పాల్గొన్నారు.

## జీవీ కొండారెడ్డి సేవలు చిరస్మరణీయం



కొండారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కోవెలకుంట్ల:** అవుకు మండలం కాశీపురం గ్రామానికి చెందిన కామ్రేడ్ జీవీ కొండారెడ్డి సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. జీవీ 35వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గాంధీసెంటర్‌లోని జీవీ స్మారక గ్రంథాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరీంబాషా మాట్లాడుతూ కోవెలకుంట్ల నియోజకవర్గంలో పేద ప్రజల అభ్యున్నతి కోసం జీవీ ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో కుందూ పోరాట సమితి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అప్పపోగు వెంకటసుబ్బయ్య, నాయకులు కరణం పుల్లారెడ్డి, ధనుంజయరెడ్డి, శివారెడ్డి, తిరుపాల్, రామచంద్రుడు, నరసింహ, సుబ్బరాయుడు, రామచంద్రరాజు పాల్గొన్నారు.

## బీసీలకు పదవుల్లో అగ్రస్థానం

- జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

**కొలిమిగుండ్ల:** ఏరాష్ట్రంలో లేని విధంగా బీసీలకు పదవుల్లో అగ్రస్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని జెడ్పీఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కొనియాడారు. శుక్రవారం సాయంత్రం కొలిమిగుండ్లలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాలకు ఎక్కువ భాగం బీసీలకు ప్రాధాన్యత కల్పించడంపై జెడ్పీ ఛైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. శాసన మండలిలో వైఎస్‌ఆర్‌సీపీ బలం 44కు చేరిందన్నారు. ఇందులో బీసీలు 19 మంది ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు అగ్రతాంబూలం కేటాయించడంతో రాష్ట్రంలో విస్తృతంగా చర్చ మొదలైందని, చర్చను పక్కదారి పట్టించేందుకు టీడీపీ నాయకులు అలజడులకు పాల్పడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు రామసుబ్బయ్య, నాయకులు టీసీ వెంకట్రాముడు, సుబ్బారెడ్డి, కామిని తిమ్మారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అన్ని విధాలా అభివృద్ధి పరుస్తాం**

**కొలిమిగుండ్ల:** అందరి సహకారంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరుస్తామని జెడ్పీఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బి.తాడిపత్రిలో వర్షాకాలంలో రైతుల పొలాల్లోకి భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో రైతుల ఇబ్బందులను తొలగించేందుకు సైడ్ వాల్ నిర్మించేందుకు పీఐయు డీఈ మన్మదబాబుతో కలిసి ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. దాదాపు వంద మీటర్ల పొడవున వాల్ ఏర్పాటు నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా జలజీవన్ మిషన్ పథకం కింద బితాడిపత్రి, బిఉప్పులూరు, నాగిశెట్టిపల్లె, కొండమీదపల్లె గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు చివరి దశలో ఉండటంతో పరిశీలించారు. తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు శాశ్వత పనులు చేపడుతున్నామన్నారు. మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొండమీదపల్లె గ్రామం సుమారు 600 అడుగుల ఎత్తులో ఉన్న కారణంగా ప్రజలు రాక పోకలు సాగించే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉండటంతో రక్షణ గోడ నిర్మించేందుకు ఆ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ కృష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఎమ్మెల్యే కాటసానికి పూలమాలవేసి కృతజ్ఞతలు తెలుపుతున్న జిల్లా ఎంపీటీసీ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపవరం గోపాల్‌రెడ్డి

**బనగానపల్లె:** రైతుల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మండలంలోని ఫతేనగర్, కటికవానికుంట గ్రామాల్లో జలకళ పథకం ద్వారా వేసిన 24 బోర్లలో నీరు సమృద్ధిగా పడడంతో శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద కాటసాని రామిరెడ్డితో పాటు తనయుడు కాటసాని ఓబులరెడ్డిని రైతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ సాగునీటి బోర్లలో జలకళ పథకం ద్వారా నీరుసమృద్ధిగా పడడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా ఇప్పటికే సుమారు వేయ్యి బోర్లు వేయించామని, జిల్లాలోనే ప్రథమస్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ రైతుపక్షపాతి అని అందువల్ల రైతుల అభివృద్ధి పథకాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లేష్‌రెడ్డి, వేనుగోపాల్, నాగయ్య, బోయమల్లేష్, ప్రతాప్, భూపాల్, భాస్కర్, కృష్ణుడు, నాగరాజు, కేశాలు, బాలమద్దిలేటి, కుమ్మరినారాయణ, బాలమద్దయ్య, మల్లికార్జున, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

**బనగానపల్లెరూరల్:** నంద్యాల జిల్లా ఎంపీటీసీ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై న గోపవరం గోపాల్‌రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి శాలువా కప్పి పూల మాలలతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆశీర్వాదంతోనే తనకు ఈ పదవి వచ్చిందని గోపవరం గోపాల్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్దుల్‌ఫైజ్, జిల్లెల్ల శివరామిరెడ్డి, గోర్విమానుపల్లి పల్లె జగన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 27లోపు ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

**డోన్ టౌన్:** ఓపెన్ ఇంటర్ పరీక్షలకు హాజరు కావడానికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27వ తేది చివరి రోజు అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాస్, ఇంటర్ మధ్యలో వదిలేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ పూర్తి చేసేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఇంటర్ మీడియట్ విద్య, ఓపెన్ స్కూల్(ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం)సంయుక్తంగా ఈ అవకాశం కల్పిస్తోందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**డోన్ టౌన్:** ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రైల్వేగేట్లు దాటేసమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆర్పీఎఫ్ సీఐ సుబ్బయ్య సూచించారు. పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శుక్రవారం హెచ్‌ఎం పద్మావతి అధ్యక్షతన విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక నంద్యాల, కర్నూలు రైల్వే గేట్లను దాటేప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, శివప్రసాద్, లక్ష్మయ్య, మధుసూదనరెడ్డి, శ్రీనివాసులు, రైల్వే ఏఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ప్యాడ్‌లు అందజేత

**కొలిమిగుండ్ల:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సహకారంతో నర్చర్ యూత్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లతో పాటు పెన్నులు అందజేశారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని నర్చర్ యూత్ ప్రెసిడెంట్ పిడతల సాగర్ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త అనిత, పిడతల దివాకర్ పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ నారాయణరెడ్డి

**కోవెలకుంట్ల:** స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని కొలిమిగుండ్ల మండలం గొర్విమానిపల్లె గ్రామ సమీపంలో నారాయణస్వామిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో సీఐ అందించిన సమాచారం మేరకు.. గ్రామంలోని కల్లందొడ్డికి వెళ్లే రస్తా విషయంలో కొంతకాలంగా నారాయణస్వామి, ఇదే గ్రామానికి చెందిన ప్రసాద్ మధ్య వివాదం కొనసాగుతోంది. గురువారం ఉద యం గొర్విమానుపల్లెకు చెందిన ప్రసాద్, రాము డు, శివరాముడు, శేఖర్, శివ మద్దిలేటి అనే వ్యక్తులు వేటకొడవళ్లతో నారాయణస్వామిని విచక్షణా రహితంగా నరికి హత్య చేసేందుకు యత్నించారు. నారాయణస్వామి భార్య సురేఖ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో నలుగురు నిందితులను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కేసులో మరో నిందితుడు ప్రసాద్ పరారీలో ఉన్నారన్నారు. హత్య చేసేందుకు ఉపయోగించిన రెండు వేటకొడవళ్లు, రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో కొలిమిగుండ్ల ఎస్ఐ రమేష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాలపై వ్యతిరేక ఉద్యమం కరపత్రాల విడుదల

**బనగానపల్లె:** మువెంట్ ఫర్ పిస్ అండ్ జస్టిస్(ఎంపీజే)ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మాదక ద్రవ్యాల పై వ్యతిరేక ఉద్యమానికి సంబంధించి యువత మేలుకో–భవితను మలుచుకో–డ్రగ్స్‌ను వదులుకో అనే కరపత్రాల ఆవిష్కరణ స్థానిక జమాతె ఇస్లామీ హింద్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా బనగానపల్లె ఎంపీజే శాఖ ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్‌ఖాన్ మాట్లాడుతూ ఎంపీజే ఆధ్వర్యంలో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ఒక బృహత్తర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ నెల 24 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఎంపీజే సభ్యులు కళాశాలలు, వైద్యశాలల్లో సామాజిక వేత్తలతో సమావేశాలు నిర్వహించి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని యువతను, ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీజే సభ్యులు యాసిర్ హుస్సేన్, రిజ్వాన్‌ఖాన్, హాఫీజ్. మహమ్మద్ రఫీ, షబ్బీర్‌బాషా పాల్గొన్నారు.

### పాడిరైతుల అభివృద్ధికి కృషి



పాడిరైతులకు నగదు అందిస్తున్న దృశ్యం

**అవుకు:** అవుకు, బనగానపల్లె మండలాల్లోని పలు గ్రామాల పాడిరైతులకు విజయ డెయిరీ యాజమాన్యం శుక్రవారం రూ.2.67లక్షలు బోనస్‌ను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా విజయ డెయిరీ బనగానపల్లె యూనిట్ మేనేజర్ పీవీ మధుసూదన్ మాట్లాడుతూ పాడిరైతుల అభివృద్ధికి విజయ డెయిరీ అహర్నిషలు కృషి చేస్తోందన్నారు. విజయ డెయిరీకి పాలు పోసే ప్రతిరైతుకు లీటరుకు రూ.2లు బోనస్ అందిస్తుందని గుర్తు చేశారు. ఈ మేరకు అవుకు మండలం గుండ్లశింగవరం గ్రామంలోని సెంటర్‌కు పాలు పోసే పాడిరైతులకు రూ.1,22,200, బనగానపల్లె మండలంలోని కైప గ్రామంలోని గురురాజు సెంటర్‌కు రూ.18వేలు, పట్టణంలోని జుబేదా సెంటర్‌కు రూ.94,532, చిన్నరాజుపాలెం సెంటర్‌కు రూ.32,800 బోనస్‌లను ఆయా రైతులకు అందించామని తెలిపారు. కార్యక్రమాల్లో పాడిరైతులు జుబేదాబీ, లక్ష్మీకాంత్ రెడ్డి, గురురాజు, ఆంజనేయులు, ఆయా గ్రామాల పాడిరైతులు పాల్గొన్నారు.

## పదవులతో సంబంధం లేకుండా పార్టీ కోసం కష్టపడతా

- అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి



**అవుకు:** పదవులతో సంబంధం లేకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడతానని దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి సతీమణి, అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల విడుదల చేసిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో చల్లా కుటుంబానికి అవకాశం ఇవ్వలేదని జరుగుతున్న చర్చ ఆమె దృష్టికి రావడంతో శుక్రవారం స్థానిక చల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చల్లా శ్రీలక్ష్మి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత మా మామయ్య దివంగతనేత చల్లా రామకృష్ణా రెడ్డికి ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారని ఆయన మరణించటంతో మళ్లీ తన భర్త దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డిని ఆ పదవిలో కూర్చోబెట్టారని గుర్తు చేశారు. ఇలా రెండసార్లు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వటమేకాకుండా మా కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచిన జగనన్న, వైఎస్సార్ కాంగ్రెస పార్టీ నిర్ణయాలకు ఎల్లప్పుడూ కట్టుబడే ఉంటానని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ పదవి విషయమంపై చల్లా అభిమానులు, కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరము లేదని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండ విజయానికి మనమందరమూ కలిసి కట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.